పేదల సొంతింటి కల బీఆర్‌ఎస్‌తో సాకారం

అంబర్‌పేట: పేదల ఇంటికలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేసిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం లబ్ధిదారులకు మంజూరైన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. మొత్తం 1,725 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అల్పాహారం అందించి వారిని ఆర్టీసీ బస్సుల్లో వెంట పెట్టుకొని ఇళ్లవద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా పేదలకు తెలంగాణలో ఇళ్ల పంపిణీ జరుగుతుందన్నారు. ఇళ్ల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టి పేదలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. పేదలకు మేలు చేస్తుంటే విపక్షాలు తట్టుకోలేకపోతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, అధికారులు మారుతీ దివాకర్, రజిత, బిక్షపతి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




లబ్ధిదారులతో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ..

ముషీరాబాద్: నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేరుస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం కేసీఆర్ అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మూడో విడతలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 1,593 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించామన్నారు. గురువారం అర్హులైన లబ్ధిదారులకు తూముకుంట, మురహరిపల్లిలో రెండు పడక గదుల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ రవిందర్, వివిధ డివిజన్ అధ్యక్షులు శ్యామ్‌యాదవ్, వై.శ్రీనివాస్‌రావు, ఎం. రాకేష్, శ్రీనివాస్‌రెడ్డి, రావులపాటి మోజెస్, బీఆర్‌ఎస్ నేతలు సుధాకర్‌గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ సీఎం కేసీఆర్ సారధ్యంలో అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు లభిస్తాయని బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్లు రావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ.. భోలక్‌పూర్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రహీం, రాకేష్, శంకర్‌గౌడ్, సాయి, మహేష్, మగ్బుల్, జబ్బార్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా !



కేసీఆర్ అభిమాని మల్లేష్‌గౌడ్ మౌనదీక్ష

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కేసీఆర్ అభిమాని మల్లేష్‌గౌడ్ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నిరసిస్తూ గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా తెగించి పోరాడి, కొట్లాడి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామాన్ని సైకిల్‌యాత్ర ద్వారా చుట్టుముట్టనున్నట్లు వివరించారు. ఈ సైకిల్‌యాత్రను శుక్రవారం శేరిలింగంపల్లి నుంచి మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ లక్ష్మమ్మ, రాజేష్, గౌతమ్, విజయ, పావని, మనోజ్, రాకేష్ తదితరులున్నారు.

నూతన జిల్లా కమిటీల ఏర్పాటు

అంబర్‌పేట: నేషనల్ బ్యాక్‌వార్డ్ క్లాస్ అసోసియేషన్ తెలంగాణ జిల్లాల నూతన కమిటీలు ఏర్పడ్డాయి. గురువారం అంబర్‌పేటలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ జిల్లా కమిటీలకు కార్యవర్గాన్ని ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా వసంతయాదవ్, ఉపాధ్యక్షురాలిగా సరోజ, హన్మకొండ జిల్లా అధ్యక్షులుగా స్వరాజ్యంగౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులుగా కుమ్మరి నర్సింహులు, రాష్ట్ర కార్యదర్శిగా తుమ్మలపల్లి శ్రీనివాస్‌లను నియమించారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతి కోసం తమ అసోసియేషన్ నిర్మాణాత్మకంగా కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ మీడియా కన్వీనర్ కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ప్రతినిధులు పులి నారాయణ, ఈశ్వర్ తదితరులున్నారు.



నూతన కార్యవర్గంతో అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

కాచిగూడ: బిహార్‌లో కులజనగణన విడుదల చేసిన విధంగానే తెలంగాణలో కూడా తక్షణమే కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన అంశాన్ని దాటవేసిన నేపథ్యంలో బిహార్ ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీ జనాభా 63 శాతం ఉందని తేల్చిందన్నారు. ఇదే ప్రామాణికంగా తీసుకుంటే రాష్ట్రంలో బీసీ జనాభా 57 శాతానికి పైగా ఉంటుందన్నారు, అన్ని తెలిసే సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే లెక్కలను బహిర్గతం చేయలేదన్నారు. తమ బీసీ రాజ్యాధికార ఉద్యమం తీవ్రతరం అవుతుందనే భయంతో కులగణన అంశాన్ని తొక్కిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణన చేపట్టకపోతే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్, జలపల్లి కిరణ్, పండరినాథ్, జయరాజ్ తదితరులున్నారు.

చేతి వృత్తిదారులకు చేయూతనివ్వడమే లక్ష్యం

కాచిగూడ: రాష్ట్రంలో చేతివృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం కాచిగూడ తుల్జాభవన్‌లో బీసీబంధు లబ్ధిదారులకు రూ.లక్ష విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీబంధు లక్ష రూపాయల పథకంలో మొదటి విడతగా 300 మందికి, రెండో విడతగా 197 మందికి ఒక్కొకరికి లక్ష చొప్పున చెక్కులను అందజేశామన్నారు. బీసీ చేతివృత్తిదారులు బీసీబంధుపథకాన్ని సద్వినియోగం చేసుకుని చేతివృత్తులను కాపాడకుంటూ.. ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు

'కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం'

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ముషీరాబాద్ బి-బ్లాక్ మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా అనురాధమోజెస్‌ను నియమిస్తూ.. ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. రాంనగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ సుజాత, రేణుక, ఉపాధ్యక్షులుగా షబానాబేగం, కార్యదర్శిగా లత, కార్యనిర్వహక కార్యదర్శిగా షహేనా, సంయుక్త కార్యదర్శిగా అబేదాబేగంలను నియమించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్నం నాగభూషణం గౌడ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, నాయకులు మురళీమోజెస్, అనురాధ పాల్గొన్నారు.

ఆరోగ్య జీవన చైతన్యానికి మ్యూజిక్ థెరపీ



నల్లకుంట: సంగీతం మంచి ఆరోగ్యం, గొప్ప జీవన చైతన్యాన్ని ప్రసాదిస్తుందని, ఆ జీవన చైతన్యాన్ని ప్రసాదించే మార్గమే మ్యూజిక్ థెరపీ అని ప్రముఖ మ్యూజిక్ థెరపిస్టు, సైకాలజిస్టు యామిని గౌరీభట్ల అన్నారు. గురువారం నల్లకుంటలోని సాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో 'ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా 'మ్యూజిక్ థెరపీ' పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ.. మ్యూజిక్ థెరపీలో రాగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఏ సాహిత్యం లేని వాద్య సంగీతం మనస్సుకు మాత్రమే ఆనందాన్ని ఇస్తుందన్నారు. పాటలు పాడుతూ.. లేదా వింటూ ఏకకాలంలో ఒక ధ్యాన స్థితికి చేరడం అనేది కేవలం మ్యూజిక్ థెరపీతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరి శారీరక అవస్థ వెనుక ఒక మానసిక కారణం, ప్రతి మానసిక అవస్థ వెనుక ఒక మానసిక కారణం కనిపిస్తుందని వివరించారు. ఈ వాస్తవాలే మ్యూజిక్ థెరపీకి మూల స్థంభాలయ్యాయని, ఈ సూత్రీకరణ ఆధారంగానే భావోద్వేగాలకు సంబంధించిన సంగీతం, శారీరక రుగ్మతలను నయం చేసే దిశగా అడుగులు వేసిందని తెలిపారు. త్వరలో 'హార్మనీ ఇన్ ది మిడ్ వీక్ మైండ్ ఫుల్ నెస్' పై వర్చికల్ ఆన్‌లైన్ జూమ్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు yaminimtheraphy@fmai.com పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గ్రామ పంచాయితీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

ముషీరాబాద్: గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మనెంట్ చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామ పంచాయితీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద గ్రామపంచాయితీ సిబ్బంది 34 రోజుల సమ్మె సందర్భంగా హామీల అమలుకై తెలంగాణ గ్రామపంచాయితీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు గడిచి బీఆర్‌ఎస్ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా కేసీఆర్, కేటీఆర్ నోటి నుంచి బంగారు తెలంగాణ పాటే తప్ప గ్రామ పంచాయితీ ఉద్యోగ బతుకుదెరువు గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయితీలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచి, ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎండీ యూసుఫ్, అడ్వైజర్ కె. సూర్యం, కన్వీనర్ చాగంటి వెంకటయ్య, ఎస్.దాసు, అరుణ్‌కుమార్, శివబాబు, కో- కన్వీనర్ ఎస్. నర్సింహారెడ్డి, జయచంద్ర, యాదమ్మ, పాండు, సుధాకర్, యాదయ్య తదితరులున్నారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎస్.వినయ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత సమాజాభివృద్ధికి ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని సీనియర్ జర్నలిస్టు, ఎస్‌వీకే సెక్రెటరీ ఎస్.వినయ్‌కుమార్ అన్నారు. వేల సంవత్సరాలుగా సమాజాభివృద్ధికి అడ్డుగోడలుగా ఉన్న కులాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారతీ అనిల్‌ల కులాంతర వివాహం జరిగింది. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగబద్ధంగా కులం, మతం వివాహానికి అడ్డుకాదన్నారు. టీపీఎస్‌కే గౌరవ అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ.. కులాంతర, మతాంతర వివాహాలు దేశంలో సమూల మార్పునకు దోహదం చేస్తాయన్నారు. కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.దశరథ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, డాక్టర్ స్వామి అల్వాల్, భూపతివెంకటేశ్వర్లు, కోట రమేష్ తదితరులున్నారు.

మానసిక వ్యాధితో బాధపడుతున్న మహిళ ఆత్మహత్య

చిక్కడపల్లి : మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడ బీమా మైదాన్‌లో నివాసం ఉండే సత్తయ్య కుమార్తె కె.స్వరూప (40) గద్వేల్‌కు చెందిన మల్లుతో వివాహమైంది. 15 ఏళ్ల క్రితమే భర్త మరణించాడు. వీరికి ఓ కుమారుడు సంతానం. అప్పటి నుంచి స్వరూప తండ్రి వద్దే ఉంటున్న ఆమెకు ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. గురువారం ఉదయం తండ్రి పనిమీద బయటకు వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

చిక్కడపల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో గురువారం బీజేపీ గాంధీనగర్ డివిజన్ వర్కింగ్ కమిటీ ఎన్నికల కార్యాచరణ ప్రణాళిక సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఓటుతోనే రాజ్యాధికారాన్ని సాధించాలి



మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన రాజ్యాధికార సాధనకై సాగే ఉద్యమంలో ఓటు అనే ఆయుధం ద్వారా సాధించుకోవాలని బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. ఈనెల 8న బీఎల్‌ఎఫ్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించనున్నట్లు వారు తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌భవన్‌లో జరిగిన సమావేశంలో నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. తెలంగాణలో 93 శాతం ఉన్న బహుజన ప్రజలను అతి స్వల్ప జనాభా ఉన్న ఆధిపత్య కులాలు రాజ్యాన్ని ఏలుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వామపక్షాలు బీఎల్‌ఎఫ్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం కావాలని కోరారు. బీఎల్‌ఎఫ్ కన్వీనర్లు దండి వెంకట్, వనం సుధాకర్, కె.పర్వతాలు, నూనె వెంకటస్వామి, పల్లపు ఉపేందర్‌రెడ్డి, సిద్ధిరాములు, కుంభం సుకన్య, లత, తుకారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. తప్పిన ప్రమాదం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. ఈ ఘటనలో భారీ ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం బాపూజీనగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు స్థానికంగా ఉన్న చెట్లతీగలు, విద్యుత్ తీగలను పూర్తిగా అల్లుకోవడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. భారీ శబ్దంతో మంటలు ఎగిసిపడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ఈ క్రమంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకువెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి వెంటనే మరమ్మత్తు పనులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పైపులైన్ పనుల పర్యవేక్షణ



కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వర్షపునీటి పైపులైన్ పనులను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ గురువారం అధికారులు, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పనులు పూర్తికాగానే సీసీ ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని సూచించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, మహేందర్, బీమ్‌రాజ్, శ్రీను, రషీద్, ఎస్. రవియాదవ్, ఆర్.సంతోష్ తదితరులున్నారు.


Happy Birthday
to our beloved leader
Sri Talasani Srinivas Yadav Garu
Minister for Animal Husbandry, Fisheries and Cinematography of Telangana
ABHISHEK
PICTURES
Signature
GRILLS
THE VEG BARBEQUE